క్లుప్తంగా

21లోపు ఓటర్ల జాబితా పూర్తి చేయండి



పెద్దకడబూరులో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమా

పెద్దకడబూరు : ఈ నెల 21వ తేదీలోపు ఓటర్ల జాబితాను పూర్తి చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమా సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఓటర్ల పరిశీలన గురించి బూత్ లెవెల్ అధికారులు, వీఆర్ఓలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి 18 సంవత్సరాలు నిండిన వారిని గుర్తించి ఓటరుగా నమోదు చేయాలన్నారు. అలాగే మృతిచెందిన వారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారిని గుర్తించి ఓటరు జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో తప్పులు దొర్లి ఉంటే సరిచేయాలన్నారు. తహసీల్దారు వీరేంద్రగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



విద్యార్థులకు మొక్కలు అందజేస్తున్న అధ్యాపకులు

ఆదోని సెంట్రల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ తెలిపారు. శనివారం కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల ఆవరణలో చింత, వేప, ఆశోక, చీమచింత వంటివి దాదాపు వంద మొక్కలను నాటారు. వైస్ ప్రిన్సిపాల్ సురేష్, ఎన్ఎస్ఎస్ అధికారి జోనాథన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రీసర్వే



అగసనూరులో రీసర్వే చేస్తున్న అధికారులు

కోసిగి: రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చేపట్టిన రీసర్వే అగసనూరు, కోసిగి గ్రామాల్లో ముమ్మరంగా సాగుతోందని తహసీల్దార్ రుద్రగౌడ తెలిపారు. శనివారం ఆయా గ్రామాల్లో రైతులతో కలిసి రెవెన్యూ అధికారులు రీసర్వే చేపట్టారు. మండలంలో రెండవ విడత కింద కోసిగిలో 3,790.60 ఎకరాలు, అగసనూరులో 2,868.79 ఎకరాల భూములను రీ సర్వే చేస్తామన్నారు. రైతులు దగ్గరుండి రీసర్వే చేయించుకోవాలని, ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఫిర్యాదు చేసుకోవచ్చునన్నారు. సర్వేయర్ బసవరాజు, వీఆర్వో బసవరాజు ఉన్నారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఆదోని అర్బన్: ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ సభ్యులు మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యేను కలసి తమ సమస్యలను వివరించారు. ఫొటోగ్రాఫర్లు కె.ప్రసాద్, కె.పురుషోత్తం, శ్రీనివాసులు, విజయ్, మురళి, భగిరత్, రాముడు, విశ్వనాథ్ పాల్గొన్నారు.

వర్షం కోసం దేవుళ్ల విగ్రహాలకు జలాభిషేకం



బసవేశ్వరుడుకి జలాభిషేకం చేస్తున్న దృశ్యం

ఆస్పరి: మండలంలోని తొగలుగల్లులో శనివారం వర్షం కోసం గ్రామంలోని దేవుళ్ల విగ్రహాలకు జలాభిషేకం చేశారు. ఓబులేషు స్వామి, ఈశ్వర స్వామి, మారెమ్మ, సుంకులమ్మ, బొడ్రాయి, ఆంజినేయస్వామి దేవుళ్లకు 108 బిందెలతో జలాభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు కురిసి పంటలు పండాలని కోరుకున్నారు.

జయప్రదం చేయండి

పెద్దకడబూరు : ఈ నెల 17 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు చేపట్టే బస్సుయాత్రను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయం ఎదుట శనివారం బస్సు యాత్రకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా, ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. వీరేష్, గిడ్డయ్య, తిక్కన్న, నరసింహులు, జాఫర్‌పటేల్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఘన విజయం

- బదినేహాల్‌లో సర్పంచ్‌గా గెలుపు
- రౌడూరులో వార్డు మెంబర్‌గా గెలుపు
- ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు



రౌడూరు పోలింగ్ కేంద్రంలో ఓట్లు వేస్తున్న ఓటర్లు



రౌడూరులో బారులుదీరిన మహిళలు

కౌతాళం: ఉప ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిసాయి. మండలంలోని బదినేహాల్ సర్పంచ్ పదవి కోసం జరిగిన హోరాహోరి పోటిలో వైఎస్సార్‌సీపీ పార్టీ ఘన విజయం సాధించింది. సర్పంచ్ పదివికి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి పెద్ద నర్సప్పకు 1,186 ఓట్లు రాగ టీడీపీ మద్దతుదారు వీరేష్‌కు 799 ఓట్లు వచ్చాయి. 387ఓట్లతో పెద్ద నర్సప్ప ఘన విజయం సాధించారు. నర్సప్పకు రిటర్నింగ్ అధికారి జనార్దన్ ధ్రువ ప్రతాన్ని అందజేశారు. అలాగే రౌడూరు గ్రామంలో 6వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికలో ఇక్కడ వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి చాకలి లింగమ్మ 56 ఓట్లతో విజయం సాధించారు. రిటర్నింగ్ అధికారి శోభరాణి ధ్రువపత్రాన్ని అందజేశారు. దీంతో రెండు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. నాయకులు వీరభద్రగౌడ్, నకేష్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, రవిగౌడ్ మాట్లాడుతూ బదినేహాల్‌లో టీడీపీ నేతలు ఓటర్లను ప్రలోబ పెట్టినా ఓటర్లు తమ పార్టీ అభ్యర్థిని గెలిపించారని, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కోఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, వినోద్‌రెడ్డి, ఉప సర్పంచ్ ప్రసన్నగౌడ్ పాల్గొన్నారు.

బదినేహాల్‌లో భారీ బందోబస్తు..

గ్రామంలో జరిగిన ఉప ఎన్నికల కోసం పోలీసులు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, కోసిగి సీఐ ఏరిషావలి, కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మరో నల్గురు ఎస్ఐలు, 60 మంది పోలీలసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేలా ప్రశాంత వాతావరణం కల్పించారు.

రెండు వార్డు సభ్యుల స్థానాలూ..

పెద్దకడబూరు : మండలంలోని కల్లుకుంట, గంగులపాడు గ్రామాల్లో రెండు వార్డులకు నిర్వహించిన ఉప ఎన్నికలు శనివారం ముగిశాయి. రెండు స్థానాలలో వైఎస్సార్ సీపీ మద్దతు దారులు గెలుపొందారు. కల్లుకుంట గ్రామంలో 11 వార్డుకు వైఎస్సార్‌సీపీ మద్దతు దారులు సుజాత, టీడీపీ మద్దతు దారులు మాణిక్యమ్మ, సీపీఎం మద్దతుదారులు రాణి ఎన్నికల బరిలో నిలిచారు. 279 ఓట్లుకు గానూ 75.4 శాతంతో 224 ఓట్లు పోల్ అయ్యాయి. అందులో సుజాతకు 112 ఓట్లు రాగా మాణిక్యమ్మకు 90 ఓట్లు వచ్చాయి. రాణి 12 ఓట్లుతో సరిపెట్టుకోగా చెల్లని ఓట్లు 9, ఒకటి మిస్(కనపడకుండా పోయింది) అయ్యింది. కాగా 22 ఓట్లుతో సుజాత గెలుపొందినట్లు ఎన్నికల అధికారి సాయికుమార్ ధ్రువ పత్రం అందజేశారు.



గంగులపాడు వార్డు సభ్యురాలిగా ఎన్నికైన ముంతాజ్



కల్లుకుంట 11 వార్డు విజేత సుజాతకు డిక్లరేషన్‌ను అందజేస్తున్న ఎన్నికల అధికారి

ఉత్కంఠ భరితంగా గంగులపాడు ఎన్నిక..

గంగులపాడు గ్రామంలో 5వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికలు ఉత్కంఠభరితంగా సాగాయి. వైఎస్సార్‌సీపీ మద్దతుదారు ముంతాజ్, టీడీపీ మద్దతు దారు లక్ష్మి మధ్య హోరాహోరీగా పోటీ సాగింది. అయితే చివరకు ఒక్క ఓటుతో ముంతాజ్ గెలుపొందింది. గ్రామంలో మొత్తం ఓట్లు 157 ఉండగా 92.35 శాతంతో 145 ఓట్లు పోల్ అయ్యాయి. కాగా అందులో ఒకటి నోటాకు పడింది. మిగిలిన 144 ఓట్లులో ముంతాజ్‌కు 72 ఓట్లు రాగా లక్ష్మికి 71 ఓట్లు వచ్చాయి. ఒక ఓటును ఎన్నికల అధికారి సువర్ణల సునియం చెల్లని ఓటుగా నిర్ధారించారు. అయితే టీడీపీ మద్దతుదారులు చెల్లని ఓటును పట్టుకొని ఎన్నికల అధికారులు అధికార పార్టీ వాళ్లకే సపోర్ట్ చేస్తున్నారని గొడవకు దిగారు. అక్కడే ఉన్న ఎస్ఐ మహేష్‌కుమార్ తన సిబ్బందితో అందరిని బయటకు పంపించారు. తమకు న్యాయం చేయాలంటూ టీడీపీ మద్దతుదారులు ఎన్నికల కౌంటింగ్ హాల్‌ముందు బైఠాయించారు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మిగనూరు రూరల్, టౌన్ సీఐలు మోహన్‌రెడ్డి, మదుసూదన్ అక్కడికి చేరుకొని వారికి నచ్చజెప్పి అక్కడినుంచి పంపించారు. అనంతరం ఎన్నికల అధికారి ముంతాజ్‌కు ధ్రువ పత్రం అందజేశారు

ప్రశాంతంగా ముగిసిన ఎన్నిక

ఆదోనిరూరల్ : మండలంలోని బసాపురం, పెద్ద తుంబళం గ్రామాల్లో శనివారం జరిగిన పంచాయతీ వార్డు మెంబర్‌ల ఎన్నికలు రిటర్నింగ్ అధికారి, ఎంపీడీఓ గీతావాణి ఆధ్వర్యంలో ప్రశాంతంగా ముగిశాయి. బసాపురంలో 2వ వార్డుకు నిర్వహించిన ఎన్నికలో టీడీపీ మద్దతుదారు జ్యోతి గెలుపొందింది. అలాగే పెద్దతుంబళంలో 14వ వార్డుకు జరిగిన ఎన్నికలో టీడీపీ మద్దతుదారు అంజనయ్య గెలుపొందారు. తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి, పెద్ద తుంబళం ఎస్ఐ చిన్నపీరయ్య, ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



రౌడూరులో వార్డు మెంబర్ ధ్రువ పత్రాన్ని తీసుకుంటున్న చాకలి లింగమ్మ



ఓట్లను లెక్కిస్తున్న అధికారులు



ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ఘనంగా మొదటి శనివారం పూజలు



మహామంగళహారతి ఇస్తున్న పూజారి

ఆదోనిఅర్బన్ : శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా పట్టణ సమీపంలోని రణమండల కొండలో వెలిసిన ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు టీజీ పాండురంగశెట్టి ఆధ్వర్యంలో వేకువజామున స్వామివారికి ఫలపంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీ, వడల హారం, పూల హారం, నైవేద్యం, మహామంగళహారతి తదితర పూజలు చేపట్టారు. వేకువజామున 3 గంటల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి 8 గంటల వరకు స్వామివారికి విశేష పూజలు జరిగాయి. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు

కౌతాళం: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. అగసలదిన్నె గ్రామంలో, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయ స్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో తెల్లవారుజామున 5 గంటకు అర్చకులు స్వామికి సుప్రభాత సేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు.

పరిశుభ్రతతోనే దోమల కట్టడి



మొలగవల్లి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలూరు రూరల్: పరిశుభ్రతతోనే దోమల వ్యాప్తిని అరికట్ట వచ్చని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ శాంతి తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మొలగవల్లి గ్రామంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. డ్రమ్ములు, కుండీలు, పాతటైర్లతోపాటు పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. చిన్నపిల్లల్లో రోజు విడిచి రోజు జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ పురుషోత్తం, ఎంఎల్‌హెచ్‌పీ రజని, ఏఎన్ఎం రుక్మిణి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలిన రైల్వే హైట్ గేజ్

తుగ్గలి: భారీ వాహనాలు రాకుండా ఉండేందుకు తుగ్గలి రైల్వే బ్రిడ్జి ముందు ఏర్పాటు చేసిన హైట్ గేజ్ శుక్రవారం రాత్రి లారీ ఢీ కొట్టడంతో కూలిపోయింది. దీంతో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు రైల్వే స్టేషన్ దారి మీదుగా వెళుతున్నాయి. హైట్ గేజ్‌ను తరచూ లారీలు ఢీకొడుతుండడంతో రైల్వే అధికారులకు సమస్యగా మారింది. వాహనాలు కూడా ఊర్లో నుంచి కాకుండా చివర నుంచి వెళ్తుండడంతో చిన్నచిన్న వాహనాల ప్రయాణికులకు సైతం ఇబ్బందిగా మారుతోంది. అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

పంటలను నమోదు చేసుకోవాలి

హాలహర్వి : ఖరీఫ్ సీజన్‌లో పంటలను సాగుచేసిన ప్రతి పంటను నమోదు చేసుకోవాలని ఏఓ శివశంకర్ రైతులకు సూచించారు. మండలంలోని సిద్ధాపురం గ్రామం రైతుభరోసా కేంద్రాన్ని శనివారం ఏఓ తనిఖీ చేశారు. ఈ సీజన్‌లో వేసిన పంటలను జియోట్యాగ్ ద్వారా ఈ క్రాప్ బుకింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్ చేయకపోతే ప్రభుత్వానికి సంబంధించిన సబ్సిడీలు, రైతు భరోసా, ఇన్సూరెన్స్‌లు వర్తించవచ్చన్నారు. వీఏఏ అజహర్, తలారి బసవరాజు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి



గోడౌన్‌ను ప్రారంభిస్తున్న ఏపీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ అశోక్‌కుమార్

నందవరం : ఔషధ, సుగంధ మొక్కల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ అశోక్‌కుమార్ సూచించారు. శనివారం మండల పరిధిలోని పోనకలదిన్నె గ్రామంలో చరణ్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో గ్రామీణ ఔషధ మొక్కల గోడౌన్, డ్రాయింగ్ యార్డ్‌ను ఆయన ప్రారంభించారు. శిల ఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ.18 లక్షలతో గ్రామీణ ఔషధ మొక్కల గోడౌన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ గోడౌన్‌లో 5,000 వేల బస్తాలను నిల్వ చేయవచ్చని, ఔషధాలను ఆరబెట్టు కోవడానికి ప్లాట్‌ఫామ్ కూడా నిర్మించామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌సీ ఆర్టికల్చర్ కన్సల్టెన్సీ భ్రమరాంబ, ఎంఎస్ఈ అగ్రికల్చర్ కన్సల్టెన్సీ దీప్తి, సూపరెంట్ ప్రియాంక, చరణ్ రూరల్ డెవలప్‌మెంట్ సిబ్బంది శ్రీరాములు, గ్రామస్తులు తిమ్మప్ప, కొండన్న, వెంకటేశ్వర్లు, రామచంద్రరెడ్డి , నరసింహులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి



రహదారి పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఆదోని సెంట్రల్: రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకట ప్రసాద్ తెలిపారు. శనివారం జగనన్న కాలనీ మీదుగా ఢణాపురం గ్రామం వరకు వేసే బీటీ రహదారి నిర్మాణాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని డీఎస్పీ బంగ్లా నుంచి రైల్వే ట్రాక్ మీదుగా జగనన్న కాలనీ, ఢణాపురం గ్రామానికి వెళ్లేలా రహదారి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. 6.50 కిలోమీటర్లు దూరం వరకు జరిగే రోడ్డు నిర్మాణానికి రూ.7.40 కోట్లు మంజూరయ్యాయని, నిర్మాణంలో భాగంగా 2 పెద్ద ఆర్‌సీ కల్వర్టులు, 4 పైపు లైను కల్వర్టుల నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. ఢణాపురం గ్రామం వద్ద 300 మీటర్లు వరకు సీసీ రహదారితో పాటు ఇరువైపులా 120 మీటర్లు ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తామని స్పష్టం చేశారు. డీఈ ఖాదర్‌బాషా, ఏఈ మాలిక్ ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి గాయాలు

కోసిగి: స్థానిక 6వ వార్డులో నివాసం ఉంటున్న ఉరుకుందు అనే వ్యక్తి విద్యుత్ షాక్‌తో తీవ్ర గాయాలపాలైన ఘటన శనివారం చోటుచేసుకుంది. వైద్య సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కొల్మాన్‌పేట గ్రామ పాఠశాలలో జరుగుతున్న పనులకు కూలీగా వెళ్లాడు. ఈ క్రమంలో ఐరన్ కడ్డీని పై అంతస్తులోకి తీసుకెళ్తుండగా పై భాగంలో ఉన్న విద్యుత్ తీగలకు ప్రమాదవశాత్తు తగిలింది. దీంతో వెంటనే విద్యుత్ షాక్ కొట్టడంతో తీవ్ర గాయాలతో కిందపడిపోయాడు. తోటి కూలీలు ఆయనను కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా సావిత్రి

ఆదోని అర్బన్: బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా ఆదోని నుంచి సి.సావిత్రిని నియమించారు. శనివారం రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన సి.సావిత్రి మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి తనను ఎంపిక చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తానని చెప్పారు.

ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

ఆదోని సెంట్రల్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఓపెన్ ఇంటర్మీడియెట్ అడ్మిషన్లను ప్రారంభించినట్లు అపాస్ కో ఆర్డినేటర్ వై.సంజన్న తెలిపారు. శనివారం ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఏర్పాటు చేసిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత సమస్యలతో చదువుకు దూరమైన వారికి ఇది మంచి అవకాశమన్నారు. పది పాసైనవారు, ఇంటర్ ఫెయిలై చదువును మధ్యలో ఆపేసిన వారు చేరవచ్చన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుక బడిన ప్రతి ఒక్కరికీ ఇది మంచి అవకాశమన్నారు. అడ్మిషన్ రిజిష్టర్ చేసుకోవడానికి ఈ నెల 31న అఖరి తేదీ అని, వివరాలకు సెల్ 9441156598 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. అధ్యాపకులు వేదావతి, చిట్టిప్రసాద్, కాంతమ్మ, సూరిబాబు, బాబు, శాంతి స్వరుప్, ఈరన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మద్యం రవాణాదారుల అరెస్టు

ఆదోని రూరల్: మద్యం రవాణా చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. శనివారం ఆదోని మండలం జాలిమంచి క్రాస్ రోడ్డు వద్ద దొడ్డనగేరి గ్రామానికి చెందిన పి.వీరేష్, ఆదోని పట్టణానికి చెందిన బోయ సూరిచంద్ర మోటర్ సైకిల్ మీద కర్ణాటక మద్యం 12 బాక్సులను తరలిస్తుండగా అరెస్టు చేసి మద్యం, స్కూటర్‌ను స్వాధీనం చేసుకొని విచారిస్తున్నట్లు చెప్పారు.

దరఖాస్తు చేసుకోండి

కౌతాళం: సహకార పరపతి సంఘంలో జనరిక మందుల దుకాణం ఏర్పాటుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కౌతాళం సింగల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు, సీఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ స్థానిక సహకార పరపతి సంఘంలో జనరిక్ మందుల అమ్మకానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని చెప్పారు. సంఘం కార్యాలయంలో జనరిక్ మందుల విక్రయాలకు అనుమతులు వచ్చాయని, ఇందుకు బీ ఫార్మసీ, డీ ఫార్మసీ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోండి

ఆదోనిరూరల్ : పట్టణ పరిసర ప్రాంత కొండల్లో అనుమతులు లేకుండా ఎర్రమట్టి తవ్వకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి డి.లక్ష్మన్న, మండల కార్యదర్శి కె.లింగన్న కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నల్లగుట్ట పాండురంగస్వామి కొండ, ఆంజనేయస్వామి విగ్రహం కొండ, దొడ్డనకేరి రూట్‌లోని ఎల్లమ్మకొండలు, దిబ్బనకల్లు, గోనబావి పరిసర కొండల్లో అనుమతులు లేకుండా కొందరు అక్రమంగా ఎర్రమట్టిని తవ్వుకొని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ కార్యదర్శి డి.లక్ష్మన్న, మండల కార్యదర్శి కె.లింగన్న తదితరులు ఉన్నారు.

పైసా ఖర్చు లేకుండా ఇంటి పట్టా



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్ : ఒక్క పైసా ఖర్చు లేకుండా ఉచితంగానే ఇంటి స్థలం పట్టాలను ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. మధ్య దళారీలను ఆశ్రయించి నష్టపోవద్దని లబ్ధిదారులకు సూచించారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో పట్టణంలోని 24, 13వ వార్డుల పరిధిలోని అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయా వార్డుల ఇన్‌చార్జ్‌లు కిట్టు, సికిందర్ ఆధ్వర్యంలో పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో రూ.2100 డీడీ కట్టిన ప్రతిఒక్కరికీ ఇంటి స్థలం పట్టా అందిస్తామని, అనంతరం పక్కా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఆర్థిక స్థోమత లేక కొంతమంది ఇళ్లను కట్టుకోలేని పక్షంలో కాంట్రాక్టర్స్ ద్వారా ఇళ్లను నిర్మించి అప్పగిస్తామని చెప్పారు. ఈ స్థలం ఏరియాలో బైపాస్ రోడ్డు రాబోతుందని, తొందరపడి దళారీల మాట నమ్మి స్థలాలను అమ్ముకోవద్దని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజలు గుర్తుకొచ్చే విపక్షాలను నిలదీయాలని, తమకు చేశారో ప్రశ్నించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. నాయకులు రహమాన్, కామాక్షి తిమ్మప్ప, 13వ వార్డు కౌన్సిలర్ బద్రున్నీషాబేగం, చిన్నఈరన్న, నారాయణ, మహ్మద్‌స్వామి, రామాంజనేయులు, వీఆర్వో జయరామిరెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుత్ షాక్‌తో గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

దేవనకొండ : మండలంలోని పల్లెదొడ్డి గ్రామంలో వడ్డే లింగన్నకు చెందిన వంద గొర్రెల్లో 36 విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్డేలింగన్న, మరికొందరు కాపరులు శనివారం ఉదయం 10 గంటల సమయంలో గొర్రెలను మేపడానికి హంద్రీనీవా కాలువపై నుంచి వెళ్తున్నారు. అయితే గద్దెరాళ్ల గ్రామ రైతులు పొలాల్లో కాలువలపై ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫారం కరెంట్ తీగ తెగిపడి ఉన్న విషయాన్ని గొర్రెల కాపర్లు వడ్డే రమేష్, వడ్డే వంశీ గుర్తించలేదు. గొర్రెలు ఒకదాని తర్వాత ఒకటి కింద పడి మంటలు రావడంతో చుట్టుపక్కల రైతులు, గొర్రెల కాపర్లు, గొర్రెలకు కరెంట్ షాక్ తగిలిందని గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని విద్యుత్‌శాఖ ఏఈ నారాయణస్వామి పరిశీలించారు.

కౌలురైతు ఆత్మహత్య



కురవ భీరప్ప

నందవరం: మండల పరిధిలోని గురజాల గ్రామానికి చెందిన రైతు కురవ భీరప్ప(37) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. భీరప్ప తన ఎకరంతో పాటు 10 ఎకరాలు కౌలు తీసుకుని పత్తి, వరి పంటలు సాగు చేశాడు. బ్యాంకులో రూ.2 లక్షలు, సమీప బంధువుల వద్ద రూ.2 లక్షలు అప్పులు అయ్యాయి. పంటలు ఎండిపోవడంతో మనస్తాపం చెందాడు. అదేవిధంగా కడుపు నొప్పిబాధలతో జీవితంపై విరక్తి చెందాడు. శుక్రవారం రాత్రి భార్య దస్తగిరమ్మతో గొడవపడి తాను కౌలుకు తీసుకున్న వడ్డె తిమ్మప్ప పొలం వద్ద పురుగు మందు తాగాడు. ఇంటికి వచ్చాక వాంతులు చేసుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు కర్నూలుకు రేఫర్ చేశారు. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధ రాత్రి మృతి చెందాడు. శనివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతిడికి భార్య దస్తగిరమ్మతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి

దేవనకొండ: ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దేవనకొండ మండలం బి సెంటర్ గ్రామానికి చెందిన మారెప్ప (26) తన సొంత పొలంలో శనివారం వ్యవసాయ పనులు చేస్తుండగా ట్రాక్టర్‌తో తిరగబడింది. ఈ ప్రమాదంలో మారెప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు మారెప్పకు ఏడాదికి క్రితం కీర్తనతో వివాహం అయ్యింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే జైలు శిక్ష తప్పదు



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పటాన్ షియాజ్‌ఖాన్

కర్నూలు(హాస్పిటల్): వైద్య విద్యార్థులు తమ తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే జైలు శిక్ష తప్పదని, ఈ మేరకు కఠిన చట్టాలు ఉన్నాయని స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్(ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్) పటాన్ షియాజ్ ఖాన్ చెప్పారు. శనివారం నగర శివారులోని పెంచికలపాడులో ఉన్న విశ్వభారతి మెడికల్ కాలేజీలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ పటాన్ షియాజ్ ఖాన్ మాట్లాడుతూ ర్యాగింగ్ నిరోధంపై విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. నేరం తీవ్రతను బట్టి శిక్ష పరిమాణం మారుతుందని చెప్పారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడినా అందుకు ప్రోత్సహించినా వారికి శిక్ష విధిస్తారన్నారు. దీనివల్ల విద్యార్థులకు భవిష్యత్‌లో సమస్యలు ఏర్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్. మనోహర, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. మునీరుద్దీన్ అహ్మద్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల మానసిక విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గంగాధరనాయక్, సోషల్ వర్కర్ రాయపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.